మాలలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస్

కవాడిగూడ, జూన్ 11: ఎస్సీ మాల కులస్తులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని తెలంగాణ మాల వారియర్స్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలను గెలుచుకున్న సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపా రు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మాల వారియర్స్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



మేరు కులస్తులకూ.. అవకాశం కల్పించాలి

మేరు, దర్జీ టైలర్స్ కులస్తులకు చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేయాలని, నామినేటెడ్ పదవుల పంపకంలో ప్రాధాన్యత ఇవ్వాలని టీపీసీసీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పొల్కం శ్రీనివాస్ కోరారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. 33 ఏండ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తున్నా మేరు కులానికి ఎలాంటి అవకాశం దక్కలేదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, పొల్కం వినయ్‌రాజ్, నవీన్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

- అబిడ్స్

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

లక్ష్మీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈ రోహిత్‌ను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూన్ 11 : గోల్నాక డివిజన్ ఇరిగేషన్ నాలాను ఆనుకొని ఉన్న బస్తీల్లో తీవ్రంగా డ్రైనేజీ సమస్య ఉందని, పరిష్కారానికి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంగళవారం ఆదేశించారు. ప్రస్తుతం అధ్వానంగా మారిన సిమెంట్ పైప్‌లైన్‌ల స్థానంలో కొత్త పైప్‌లైన్ వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొన్ని రోజులుగా గోల్నాక డివిజన్‌లోని ఇరిగేషన్ నాలాను ఆనుకొని ఉన్న లక్ష్మీనగర్, కమలానగర్, తులసీరాంనగర్(లంక) బస్తీలలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారింది. ఇరిగేషన్ నాలాలో గత పదేండ్ల క్రితం వేసిన సిమెంట్ 500 డయా డ్రైనేజీ పైపులు డ్యామేజ్ అయ్యాయి. ఆ పైపుల్లో డ్రైనేజీ వ్యర్థాలు పూర్తిగా నిండిపోయాయి. దీంతో లక్ష్మీనగర్, కమలానగర్, తులసీరాంనగర్(లంక) బస్తీల్లో ఉన్న సబ్‌లైన్ల నుంచి వచ్చే డ్రైనేజీ నాలాలో ఉన్న పైపుల్లోకి వెళ్లడం లేదు. మురుగు మొత్తం రివర్సయ్యి ఇండ్లలోకి వస్తున్నది. వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకొని వెళ్లగా వారు వచ్చి మిషన్ పెట్టి తాత్కాలికంగా సమస్యను పరిష్కరిస్తున్నారు. వారం రోజుల్లోనే సమస్య మళ్లీ మొదటికొస్తుంది. కొన్ని రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. బస్తీ ప్రజలు మురుగు దుర్వాసనను తట్టుకోలేక సమస్యను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కాలేరు వాటర్‌వర్క్స్ సెక్షన్ మేనేజర్ రోహిత్‌ను వెంటబెట్టుకొని లక్ష్మీనగర్‌లో పర్యటించారు. బస్తీవాసుల నుంచి సమస్యను తెలుసుకున్నారు. సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రస్తుతం వ్యర్థాలు తొలగించి మురుగు సాఫీగా వెళ్లేలా చూడాలని చెప్పారు. కొత్త ప్రతిపాదనలు తయారు చేస్తే నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. సమస్య తీవ్రతను వాటర్‌వర్క్స్ ఎండీ దగ్గరకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంతోష్, బస్తీవాసులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు పత్రం అందజేత

అనారోగ్యంతో బాధపడుతూ అంబర్‌పేటకు చెందిన అహ్మద్‌అలీ నిమ్స్‌లో చేరాడు. అతడు సీఎం రిలీఫ్‌ఫండ్‌కి దరఖాస్తు చేసుకోగా లక్ష రూపాయలు మంజూరైనవి. ఆ మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అతనికి అందజేశారు.

శంకర్ యాదవ్‌కు ఘన నివాళి

చిక్కడపల్లి, జూన్ 11 : మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు మోండా మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ మృతి చెందారు. కాగా మంగళవారం ఆయన పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ తదితరులు నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. బన్సీలాల్ పేట్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పార్టీ నాయకులు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

15న కృష్ణమాచార్య శత జయంతి

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, విజయ్‌కుమార్

చిక్కడపల్లి, జూన్ 11: శ్రీ కళామంజరి, నవ్యనాటిక సమితి ఆధ్వర్యంలో సంగీత, సాహిత్యకళానిధి, గాన కళాపూర్ణ శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్య శతజయంతిని 15న శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంస్థల ప్రతినిధులు బండారి రమేశ్, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, ఎం. లక్ష్మీ మానస తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలోని నవ్యసాహిత్య సమితి కార్యాలయంలో కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర ఆవిష్కరించారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వతి పరిషత్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమనానికి డాక్టర్ కె.వి. రమణాచారి, పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమన్వయ కర్త నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరాహేమ, వి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ ముఖ ద్వార నిర్మాణానికి రూ. 2 లక్షల చెక్కు అందజేత

కవాడిగూడ, జూన్ 11: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని సింగాడికుంటలోని ఎల్లమ్మ నాగదేవత దేవస్థానం ముఖద్వారం నిర్మాణానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విరాళంగా ఇచ్చిన రూ. 2 లక్షల చెక్కును ఆయన దేవస్థానం అధ్యక్షుడు బడే శ్రీనివాస్, సింగాడికుంట బస్తీ అధ్యక్షుడు బడే రాముకు అందజేశారు. కార్యక్రమంలో బస్తీ వాసులు ఎం. లక్ష్మణ్, కె. మహేశ్, కె. రాము పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనిచేయాలి

మెహిదీపట్నం, జూన్ 11 : వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నాలా పూడికతీత పనులను చేపట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. మ్యాన్‌హోల్ క్యాచ్‌పిట్‌ల వద్ద మట్టి కుప్పలు లేకుండా చూడాలన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కుడే, సర్కిల్ -12 డిప్యూటీ కమిషనర్ నాగేశ్వర్‌రావు, ఏఎంఓహెచ్ డాక్టర్ విజయ్, ఈఈ లాల్‌సింగ్‌తో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు చర్యలు ఎక్కడాకనిపించడం లేదని, మట్టి కుప్పల తరలింపులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాలాలో పూడిక తీత పనులను వేగంగా నిర్వహించాలని, మాన్‌సూన్ బృందాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. సమావేశంలో ఎంఐఎం నాయకులు డాక్టర్ షేక్ ఖాసీం, ఎండీ మూసా, ఆరిఫ్ రిజ్వాన్, సర్పరాజ్ సిద్ధిఖీ పాల్గొన్నారు.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వీ డ్రీమ్స్ బిజ్‌టెక్ కార్పొరేట్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో ప్రింట్‌మీడియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం స్థానిక విజయానంద్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ప్రింట్‌మీడియా టీమ్ 39 పరుగుల తేడాతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీజీ)పై ఘన విజయం సాధించింది. బుధవారం జరిగే సెమీస్‌లో డాక్టర్స్-11 టీమ్‌తో ప్రింట్‌మీడియా తలపడనుంది.

కవి గోన బుద్ధారెడ్డి సంస్మరణ సభ

చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా మంగళవారం ప్రముఖ కవి గోన బుద్ధారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని బుద్ధారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పొత్తూరి సుబ్బారావు, చిక్కా రామదాసు, బాలరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

- కవాడిగూడ

మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించడంతో జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ పుట్లిబౌలిలో మంగళవారం బీజేపీ నాయకులు, అభిమానులతో కలిసి మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్‌యాదవ్, అమర్‌సింగ్, అనిల్‌యాదవ్, ప్రవీణ్, కాజల్, అజ్జు నర్సింగ్, రామకృష్ణ పాల్గొన్నారు.

- అబిడ్స్

మోదీ మంత్రివర్గంలో బీసీలకు సముచిత స్థానం దక్కిందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌కుమార్ అన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం కొలువుతీరిన సందర్భంగా మంగళవారం కాచిగూడలో మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో అచ్చిని రమేశ్, రవీందర్, కిశోర్‌కుమార్, ఆనంద్‌దాస్, మధు, యాదగిరి, వివేక్ పాల్గొన్నారు.

- కాచిగూడ

వైద్యుల సాధారణ బదిలీలను పారదర్శకంగా చేపట్టాలి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సమస్యలను విన్నవిస్తున్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ వి. శేఖర్

సుల్తాన్‌బజార్, జూన్ 11: వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టనున్న వైద్యుల సాధారణ బదిలీలను ఎలాంటి వత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాస్పత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ వి. శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జేఏసీ సభ్యులతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతినిధులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాబురావు, డాక్టర్ జగతిలతో కలిసి మాట్లాడుతూ.. వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియలో వైద్య సంఘాల నాయకుల పాత్ర లేకుండా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ హేమలత, డాక్టర్ అమరావతి, కో కన్వీనర్లు డాక్టర్ సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి

మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి వేడుకలను గోషామహల్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. బేగంబజార్‌లోని ప్రతాప్‌సింగ్ విగ్రహానికి టీపీసీసీ సీనియర్ నాయకుడు సుధీర్‌కుమార్ తివారి, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

- అబిడ్స్

మరమ్మతులు చేయాలి

వీధిదీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ జీహెచ్ఎంసీ వీధి దీపాల విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం దారుస్సలాంలో అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. బక్రీద్ వస్తున్న నేపథ్యంలో బస్తీలు, ప్రధానరోడ్లపై వీధి దీపాలకు మరమ్మతులు చేయాలన్నారు.

- మెహిదీపట్నం

ఎస్ఎన్‌డీపీ పనులు వేగవంతం చేయాలి

ఎస్ఎన్‌డీపీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ ఖాద్రీ అన్నారు. మంగళవారం ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వర్‌రావు, ఎస్ఈ భాస్కర్‌రెడ్డిలతో కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు.

- మెహిదీపట్నం

ప్రసూతి దవాఖానలో సమస్యల పరిష్కారానికి కృషి

సుల్తాన్‌బజార్, జూన్ 11 : సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో అగ్నిప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి టి. శ్రీనివాస్ అన్నారు. ఇటీవల వర్షం పడినప్పుడు దవాఖానలో ఎంసీబీలో వైర్లు కాలి అగ్ని ప్రమాదం సంభవించిన విషయం విదితమే. కాగా మంగళవారం ఆయన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఆర్ఎంవో సీహెచ్. ప్రభాకర్, టీఎస్ఎంఐడీసీ ఏఈతో కలిసి దవాఖానలోని నూతన, పాత భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో ఫైర్ సేఫ్టీని సక్రమంగా అమర్చకపోవడంతో మండిపడ్డారు. ఫైర్ సేఫ్టీకి ఉపయోగించే నీటి వసతి కోసం ప్రత్యేక ఫైర్ ట్యాంకును ఎందుకు ఏర్పాటు చేయలేదని ఏఈని ప్రశ్నించారు.

నూతన భవనంలో వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక ఆ నీరు గోడలలో ఇంకి ఎర్తింగ్ వస్తుందని సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఎర్తింగ్ వచ్చే వార్డులలోని గర్భిణులు, బాలింతలను ఇతర ప్రాంతాలకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా దవాఖాన ఆవరణలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని ఏఈని ఆదేశించారు.

ఫైర్ సేఫ్టీ వివరాలు తెలుసుకుంటున్న జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి

స్టాఫ్‌నర్సుల సమస్యలు పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్, జూన్ 11 : ఆరేళ్లుగా పదోన్నతులు, సాధారణ బదిలీలు చేపట్టక పోవడంతో టీవీవీపీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు ఇబ్బందులు పడుతున్నారని స్టాఫ్ నర్సులు సైదమ్మ, షాహిదా,పాలినా తెలిపారు. మంగళవారం కింగ్‌కోఠి జిల్లా దవాఖానలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. స్టాఫ్ నర్సులకు బదిలీల ప్రక్రియను చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీవోపై పూర్తి క్లారిఫికేషన్ లేదని అన్నారు.

నోయిడాలో జరిగిన జాతీయ ఇమ్యునోహెమటాలజీ వెట్ వర్క్‌షాప్, సదస్సులో ఉస్మానియా ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్, బ్లడ్ బ్యాంక్ విభాగం సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సాయిసుధ బీట్ ది ఇమ్యునోహెమటాలజీ సిరీస్-3 పరీక్ష రాసి, క్విజ్‌లో మొదటి బహుమతి, వివాలో మూడో బహుమతిని సాధించారు. ఆమెను దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, ఆర్ఎంవో డాక్టర్ అనూరాధ అభినందించారు.

- సుల్తాన్‌బజార్

రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం

చిక్కడపల్లి, జూన్ 11 : దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్ అధ్యక్షతన జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షులుగా పి. ఉమర్ ఖాన్, చీఫ్ అడ్వైజర్ కె.వి.కె. రావు, చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య వర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.అడివయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్, కోశాధికారి కె.వెంకట్ లతో పాటు 300 మందితో సంఘం ఏర్పాటు చేశారు.

వ్యక్తి అదృశ్యం

కార్వాన్, జూన్11: ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటన టప్పాచబుత్రా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపిన ప్రకారం.. జిర్రాలోని సలీం కేఫ్ ప్రాంతంలో ఉండే సయ్యద్‌షాఖిర్‌అలీ మెకానిక్. ఈ నెల 6న షాఖిర్ అలీ కనిపించకుండా పోయాడు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ యాదయ్య తెలిపారు.

అంబులెన్స్ విరాళం

పేద రోగులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. మంగళవారం సీఎస్ఆర్‌లో భాగంగా అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను మిథాని లిమిటెట్ సంస్థ దవాఖానకు విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా ఆయన దవాఖాన ఆవరణలో అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ అంబులెన్స్‌లో ఆక్సిజన్, వెంటిలేటర్, డీఫ్రిజ్, మానిటర్ వంటి పరికరాలు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచి రోగి ప్రాణాలను కాపాడేందుకు దోహద పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా మిథాని లిమి టెడ్ సంస్థ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- సుల్తాన్‌బజార్

సమాజాన్ని అధ్యయనం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

చిక్కడపల్లి, జూన్ 11 : విద్యార్థులు సమాజంలో అసమానతలు, ఆర్థిక అంతరాలు రూపుమాపేందుకు అధ్యయనం చేయాలని ఆంధ్ర జ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతుల ప్రారంభ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో అధిపత్య వర్గాల భావజాలం అధికార భావజాలంగా ఉందని బలహీన వర్గాలు, పేదలు వారికి అందాల్సిన సౌకర్యాలు దేశంలో అందడం లేదన్నారు. ప్రశ్నించడం కీలకమని ప్రశ్నతోనే సమాజం ముందుకు వెళ్తుందన్నారు. సమాజంలో జరిగే దోపిడీ అసమానతలు ఆధిపత్య ధోరణలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఉపాధ్యక్షుడు రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, శంకర్, మమత, కిరణ్, అశోక్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను వచ్చే నెల 10 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

రైల్లోంచి జారిపడి యువకుడు మృతి

కాచిగూడ, జూన్ 11: ప్రమాదవశాత్తు రైల్లోంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. సికింద్రాబాద్‌లోని బోయిగూడకు చెందిన హరినాథ్ కుమారుడు జనసూర్య(20)ఇంటర్మీడియట్. సోమవారం రాత్రి అతను ఫలక్‌నుమా నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లడానికి ఎంఎంటీఎస్ రైల్లో ప్రయాణిస్తుండగా యాకుత్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లోంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

కాచిగూడ,జూన్ 11: కాచిగూడ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(45)కాచిగూడలోని డీమార్ట్ సమీపంలో ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో ఉంటూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుని ఒంటిపై ఆకుపచ్చ రంగు చొక్క, కాకి రంగు ప్యాంట్ ధరించి ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8712660543లో సంప్రదించాలని కోరారు.